నీరివ్వండి.. నారును బతికించండి

- ఎండిపోతున్న నారు మడులు
- ఖరీఫ్‌కు విడుదలకాని సాగునీరు
- శివారు ప్రాంత రైతుల్లో ఆందోళన
- రైతుల గోడు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కృత్తివెన్ను మండలం గరిశపూడి వద్ద అడుగంటిన సాగునీరు

కృత్తివెన్ను: ఆదిలోనే హంసపాదులో తయారైంది ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయం అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమై రైతులు దమ్ములు చేసుకోవాల్సి ఉండగా అడుగంటిన ప్రధాన పంటకాలువ రైతుల అదృష్టాన్ని వెక్కిరిస్తోంది. ఇప్పటికే చాలా మంది రైతులు కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాలకు నారుమళ్లు వేసుకున్నారు. ఇప్పుడు వాటికి నీరు పెట్టాల్సి ఉండగా కాలువల్లో నీరు అడుగంటిపోవడంతో పంట తూముల్లోకి నీరు రావడం లేదు. దీంతో వ్యవప్రాయాలకోర్చి ఆయిల్ ఇంజిన్‌లతో నీటిని తోడుకుంటూ నారును కాపాడుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ ఏడాది కృత్తివెన్ను మండలంలో 7,500 పైచిలుకు భూముల్లో ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు.

ఇప్పుడే ఇలా అయితే భవిష్యత్తు ఏమిటి?

సాగు ప్రారంభంలోనే ఈ విధమైన నీటికొరత ఉంటే రాబోయే రోజుల్లో పంటల పరిస్థితి ఏంటన్న భయం రైతులను వెంటాడుతుంది. ప్రస్తుతం నారుమడులకు, దమ్ములకు నీటిని ఆయిల్ ఇంజిన్‌లతో తోడాల్సి రావడంతో ప్రారంభంలోనే ఖర్చులు పెరిగిపోతున్నాయని వారు వాపోతున్నారు.


కృత్తివెన్ను మండలం యండపల్లి వద్ద నారుమడికి ఆయిల్ ఇంజిన్‌తో నీరు తోడుకుంటున్న దృశ్యం

శివారు సంగతైతే చెప్పనక్కరలేదు..

అధికశాతం పంట భూములు ప్రధాన పంటకాలువకు సుదూరంగా ఉన్నాయి. మునిపెడ, నీలిపూడి, కొమాళ్లపూడి, సీతనపల్లి, చినపాండ్రాక తదితర గ్రామాలలోని వేలాది ఎకరాలకు బ్రాంచి కాలువలే ఆధారం. ప్రధాన కాలువలోనే నీరు లేకపోవడంతో బ్రాంచి కాలువల ద్వారా సాగు చేయడం తలకు మించిన భారమే అవుతుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కృత్తివెన్ను మెయిన్ కాల్వకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్య ఇది..

గడ్లవల్లేరు లాకుల నుంచి మూడు కాలువలు డివైడ్ అవుతాయి. ఒకటి కైకలూరు వైపు, రెండోది పెదలంక కాలువకు, మూడోది బంటుమిల్లి-కృత్తి వెన్నుకాలువ. కైకలూరు కాలువకు అవసరాలకు సరిపడా సాగునీరు వదిలారని రైతులు చెబుతున్నారు. పెదలంక, కృత్తివెన్ను కాలువకు ఆ జాలు నీరే వస్తుందంటున్నారు.

ఇలా ఎందుకంటే..

వాస్తవానికి ఈ కాలువకు 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలి. అయితే 270 కంటే తక్కువ నీరు వదులుతున్నామని ప్రచారం చేస్తున్నా అందులో వాస్తవం లేదని తెలుస్తోంది. ఇందుకు కారణంగా గుడ్లవల్లేరు లాకుల పైన హెడ్‌వెయిట్ 200 క్యూసెక్కులకు పైగా ఉండాలి. కానీ ప్రస్తుతం 170 క్యూసెక్కులు కూడా ఉండటం లేదని సమాచారం. దాని వల్ల ప్రస్తుత పరిస్థితి ఎదురవుతోందని విశ్వసనీయ సమాచారం.

ప్రారంభంలోనే ఇలా అయితే ఎలా?



దాళ్వాకు ఎలాగూ నీరివ్వలేదు. కనీసం సార్వాకైనా నీటి కొరత లేకుండా నీరివ్వాల్సి ఉంది. ప్రారంభంలోనే కాలువ అడుగంటి పోతే ఎలా. ఆయిల్ ఇంజిన్‌లతో నీరు తోడి సాగుచేయాలంటే రైతులకు ఆర్థికభారం పెరిగి అప్పుల పాలవుతారు. మా కాల్వకు వెంటనే నీరు విడుదల చేయాలి.

– పిన్నెంటి బాబ్జీ, రైతు, యండపల్లి

శివారు భూముల్లో చాలా కష్టంగా



నేను ప్రధాన పంటకాలువకు దూరంగా ఉన్న భూముల్లో కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. ఆయిల్ ఇంజిన్‌లతో నీరు తోడి సాగు చేయాలంటే సాధ్యపడే పనికాదు. మా భూములకు నీరు చేరాలంటే కాలువల ద్వారా పుష్కలంగా నీరు రావాలి. దీనిపై అధికారులు శ్రద్ధ తీసుకోవాలి.

– ఆర్.నాగేశ్వరరావు, కౌలురైతు, అడ్డపర్ర

2,3 రోజుల్లో నీరు విడుదల చేస్తారు

ప్రస్తుతం కొద్దిగా నీరు విడుదల చేశారు. శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే రెండు మూడు రోజులు పడుతుంది. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. త్వరలోనే పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల అవుతుంది.

– రాజ్యలక్ష్మి, ఏఈఈ, ఇరిగేషన్ బంటుమిల్లి సెక్షన్, కృత్తివెన్ను

క్లుప్తంగా

30 పోలీస్‌యాక్ట్ అమలు

కోనేరుసెంటర్: మొహర్రం సందర్భంగా బందరు సబ్‌డివిజన్ పరిధిలోని బందరు, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలుపరుస్తున్నట్లు బందరు డీఎస్పీ సీహెచ్ రాజ శుక్రవారం తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసుల అనుమతి లేకుండా రహదారులపై బైక్ ర్యాలీలు, డీజేలుతో ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు. పోలీసు ఆంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడే ప్రసక్తే ఉండదన్నారు. పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

స్కూల్ బస్సుల తనిఖీ

చల్లపల్లి: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నడిపే స్కూల్ బస్సుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించటంతోపాటు, బస్సులో ప్రయాణించే పిల్లల రక్షణకు తచు చర్యలు కూడా తీసుకోవాలని మచిలీపట్నం ఆర్‌టీఏ ఎంవీఐ) జె.నారాయణస్వామి సూచించారు. స్థానిక ప్రధాన సెంటర్లో శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. వాహనాల స్థితిని, డ్రైవర్ అర్హతలు పరిశీలించారు. పిల్లలు బయటకు రాకుండా వారిని నియంత్రించేందుకు బస్సు ద్వారం వద్ద ఆయా, క్లీనర్‌ను తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. నిబంధలను పాటించని బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చెత్త బుట్టల పంపిణీ

గూడూరు: స్వచ్ఛ భారత్‌లో భాగంగా గూడూరు పంచాయతీ పరిధిలో ఇంటింటికీ శుక్రవారం చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి లింగం సులోచనా రాణి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలోని వివిధ వార్డుల్లో ఇంటికి ఒక డస్ట్‌బిన్ అందజేశారు. వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరి వేడుక

నాగాయలంక: స్థానిక శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీరామ క్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాకంబరి వేడుక కనుల పండువగా జరిగింది. కమిటీ నేతృత్వంలో 108 కేజీల కూరగాయలు, ఆకుకూరలతో ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, ముదునూరి అచ్యుత శేఖరశర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని కనకదుర్గమ్మ మూలవిరాట్, ముఖమండపంలోని పీఠంపై ప్రతిష్ఠించిన వారాహిదేవి అమ్మవారి విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణప్రసాద్ (బుజ్జి), బోయపాటి రాము, సభ్యులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

బంటుమిల్లి: ప్రధాన పంటకాలువలకు సాగునీటిని విడుదల చేసి వ్యవసాయాలని రైతుసంఘం నాయకులు, రైతులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బంటుమిల్లి మెయిన్ కాలువతో పాటు, అనుబంధ కాల్వలకు సైతం నీటిని విడుదల చేయాలన్నారు. చోరంపూడి చానల్‌పై గతంలో శిథిలమైన డ్రాప్ స్థానంలో నూతన డ్రాప్‌ను వెంటనే నిర్మాణం చేయాలన్నారు. మండల పరిధిలోని కాల్వలపై దెబ్బతిన్న గేట్లు స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే వెదజల్లిన చేలు నీరు లేక ఎండిపోతున్నాయని వెంటనే సాగునీరిచ్చి ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, ప్రసాద్, వెంకన్న, జి.వెంకన్న, అజయ్‌ఘోష్, నారాయణరావు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

అవనిగడ్డ: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం భోజన విరామ సమయంలో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నారాయణ, కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఏజే రత్నాకర్, జోనల్ కమిటీ సభ్యులు డీఎస్ రావ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఎస్ రావ్, డిపో అధ్యక్షుడు బీఎల్ ప్రసాద్, కార్యదర్శి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఘంటసాల: మండల పరిధిలోని దేవరకోట శివారు బిరుదుగడ్డ నుంచి దాలిపర్రు వరకు గుండేరు మేజరు డ్రెయిన్ కరకట్టల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. డ్రెయినేజీ డీఈఈ జె.బాబూ నాయక్, ఏఈఈ చిరంజీవి పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

కోడూరు: ఉపాధ్యాయులకు బోధనేతర పని భారాన్ని ప్రభుత్వం తగ్గించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ పెరుమాళ్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జెడ్పీ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందించారు. డీపీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి బి.రాఘవ శ్రీను, నేతలు సాంబశివరావు, పి.రాంబాబు, వై.జగదీష్, సూర్య, బాలాజీ, సీతారామన్, మదన్‌కుమార్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

పింగళికి నివాళి

మచిలీపట్నంటౌన్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక చిలకలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన విగ్రహం వద్ద శుక్రవారం నివాళులు అర్పించారు. కృష్ణాజిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ (డీసీఎంఎస్) చైర్మన్ బండి రామకృష్ణ నాయకులు, కార్యకర్తలతో కలసి పింగళి విగ్రహానికి నివాళులు అర్పించారు.

అల్లూరి, రోశయ్యలకు ఘన నివాళి



చల్లపల్లి: అల్లూరి సీతారామరాజు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యల జయంతిని స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న పింగళి విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

పెడన: మన్నెం వీరుడు అల్లూరి జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఎ.అరుణకుమారి నివాళులర్పించారు. కార్యాలయం ఉద్యోగులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోగినేనిపాలెం(ఘంటసాల):అల్లూరి జయంతి వేడుకలను గోగినేనిపాలెం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి ఉప సర్పంచ్ గణపనేని వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత కుంపటి శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శి వసుంధర నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు.

మచిలీపట్నంటౌన్: విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం స్థానిక గొడుగుపేటలోని కూనపరెడ్డి ట్రస్ట్‌లో నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మిత్ర మండలి ప్రతినిధులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, హరికృష్ణ, జీఎస్సార్ మూర్తి, చలమలశెట్టి మల్లేశ్వరరావు, సలాది రామకృష్ణ, లింగం మోజెస్, జుజ్జూరి ప్రసాదు, జూపూడి వెంకటాచలం పాల్గొన్నారు.

బంటుమిల్లి: అల్లూరి సీతరామరాజు జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్మోహనరావు అధ్యక్షత వహించారు.

పేదల కోసం అలుపెరగని పోరాటం చేసిన రంగా

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: బడుగు బలహీన వర్గాల సమస్యల కోసం వంగవీటి మోహనరంగా అలుపెరగని పోరాటం చేశారని మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహానికి సింహాద్రి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రంగా జీవితమంతా పేదల కోసమే పోరాటం చేశారని అన్నారు. ఆనాటి దుర్మార్గపు పాలకుల చేతిలో రంగా అసువులు బాశారని చెప్పారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, రాధా రంగా మిత్రమండలి దివియూనిట్ అధ్యక్షుడు రాజనాల మాణిక్యాలరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావు అందరివాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. రంగా జయంతి వేడుకలను శుక్రవారం నగరంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామనాయుడుపేటలోని పార్టీ కార్యాలయం నుంచి పేర్నికిట్టు ఆధ్వర్యంలో రంగా విగ్రహాల వద్దకు బైక్‌ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. స్థానిక చిలకలపూడి సెంటరు, రేవతి థియేటర్ సెంటర్‌లలో ఉన్న వీఎం రంగా విగ్రహాలకి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ వీఎం రంగా పేదల పెన్నిధిగా పేరొందారన్నారు. డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కార్పొరేటర్లు రాసంశెట్టి వాణిశ్రీ, మాచవరపు రాంప్రసాద్, పర్ణం సతీష్, జోగి చిరంజీవి, యండ్రపాటి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి వరప్రసాద్, పల్లి శేఖర్, మాజీ పీపీ కొక్కిలిగడ్డ శరత్ కుమార్, మట్టా తులసి, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, గాజుల భగవాన్, షేక్ మొహమ్మద్‌సాహెబ్, మహ్మద్ రఫీ, చింతా మౌనిక, మట్టా నాంచారయ్య, గడిదేశి డేవిడ్‌రాజు, పిప్పళ్ల నాగబాబు పాల్గొన్నారు.

పెడన: నిరుపేదల అభ్యున్నతి కోసం ప్రాణాలను అర్పించన వ్యక్తి వంగవీటి మోహన్‌రంగా అని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. శుక్రవారం రంగా జయంతి వేడుకలను పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. రంగా చిత్రపటానికి రాము, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాము మాట్లాడుతూ నిరుపేదల కోసం విజయవాడ నగరం నడిబొడ్డులో నిరహారదీక్ష చేపట్టిన రంగాను కొందరు దుండగలు అయ్యప్ప మాల ధరించి పొట్టపెట్టుకున్నారని దుయ్యబట్టారు. పార్టీ పట్టణ కన్వీనర్ కర్ణా శ్రీనివాసరావు, మండల కన్వీనర్ దావు బైరవలింగం, పార్టీ నాయకులు రాజులపాటి అచ్యుతరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా, మాదాసు బాబురావు, వన్నెంరెడ్డి మహాంకాళరావు, కౌన్సిలర్లు పిచ్చిక సతీష్‌బాబు, శిరివెళ్ల జయేష్, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలో వంగవీటి రంగా జయంతిని శుక్రవారం నిర్వహించారు. కోసూరువారిపాలెంలో గ్రామ ఉపసర్పంచ్ కోసూరు రాధాకృష్ణ దివంగతనేత మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు, విద్యాశాఖ కమిటీ జిల్లా మాజీ చైర్మన్ కోసూరు నాగమల్లేశ్వరావు, గౌరీ శంకర్, కోసూరు అమలేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక పడమర వీధిలోని జెండా చెట్టు వద్ద ఉన్న రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు వెనిగళ్ళ తారక జగదీష్ నివాళులర్పించారు. పార్టీ ఉపాధ్యక్షుడు మోతుకూరి ఏడుకొండలు, పాగోలు మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు అర్జునరావు, పరుచూరి బాబు, వై.జగదీష్, భాస్కరరావు పాల్గొన్నారు.

మచిలీపట్నం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో

కోనేరుసెంటర్: రంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. రంగా జయంతిని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కిట్టు రంగ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేకును కట్ చేసి పంచిపెట్టారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, పలువురు కార్పొరేటర్‌లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడూరు: దివంగత మాజీ ఎమ్మెల్యే, కాపు నేత వంగవీటి మోహనరంగా జయంతిని కోడూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో రంగా విగ్రహానికి వివిధ పార్టీల నేతలు నివాళుల ర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. యువకులు కోడూరు వంతెన సెంటర్ నుంచి ఉల్లిపాలెం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉల్లిపాలెంలోని రంగా కాంస్య విగ్రహానికి కాపు యువత నివాళులర్పించారు. కోడూరు తూర్పు, పిట్టల్లంక, వి.కొత్తపాలెంలోని రంగా విగ్రహాల వద్ద జయంతి వేడుకలను జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నేతలు పాల్గొన్నారు.


చిలకలపూడి సెంటరులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, నాయకులు


పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాము తదితరులు


చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

అవనిగడ్డ: స్థానిక తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయంలో రంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు రంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామ రాజు, స్వామీ వివేకానంద, పింగళి వెంకయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గౌరుముచ్చు ఉమాతో పాటు పలువురు యువకులు రక్తదానం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు.

కృత్తివెన్ను: మండల పరిధిలోని పలు గ్రామాలలో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాంధీనగరం, చెరుకుమిల్లి, చినపాండ్రాక, నీలిపూడి, చందాల, లక్ష్మీపురం గ్రామాలలోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి వేడుకలు జరిపారు.

నాగాయలంక: వంగవీటి రంగా జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ చౌరాస్తా రంగా సెంటర్‌లో రంగా విగ్రహానికి కాపునాడు అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్ష,ఉపాధ్యక్షులు భోగాది సోమశేఖర్ (చిన్నారి), తోట శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఆసుపత్రులలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, పాలెం సర్పంచి అంబటి శ్యామ్ ప్రసాద్, రాధ, భోగాది శివవిష్ణువర్ధన్, గుడివాక శివాజీ పాల్గొన్నారు. మర్రిపాలెం వంతెన సెంటర్, టి.కొత్తపాలెం లాకులు సెంటర్‌లలో రంగా విగ్రహాలకు నివాళులర్పించారు.

వార్డుల్లో పార్టీ ఇన్‌చార్జిలు చెప్పింది చేయాలి

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: పట్టనంలోని వార్డుల్లో టీడీపీ ఇన్‌చార్జిలు ఉంటారని, వారు చెప్పింది చేయాలని, అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. పురపాలక సంఘ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మెప్మా విభాగంలోని ఆర్పీలకు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ట్యాబ్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆర్పీలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలో 26 మంది ఆర్పీలకుగా 22 మంది ఆర్పీలకు ట్యాబ్‌లను అందజేశారు. 9వ వార్డుకు చెందిన ఆర్పీకి ట్యాబ్ అందజేయలేదు. కుమార్తెకు బదులుగా తల్లి ట్యాబ్‌ను అందుకోవడానికి రావడంతో టీడీపీ నాయకులు కమ్మగంటి వెంకటేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే టాబ్ ఇవ్వకుండా తరువాత చూద్దామంటూ దాటవేశారు. అంతకు ముందు నాలుగో వార్డులో తల్లికి బదులుగా కుమార్తె రావటంతో అందజేశారు. అలా ఇచ్చినప్పుడు నాకు కూడా ఇవ్వాలి కదా అని ప్రశ్నించడంతో ఎవరూ సమాధానం ఇవ్వకుండా దాటవేస్తూ తరువాత చూద్దామని పేర్కొంటూ ఇవ్వలేదు. 22వ వార్డు ఆర్పీకి కూడా ఇవ్వలేదు.


ఆర్పీలకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అదేమని అధికారులను అడిగితే ఆన్‌లైన్ కాలేదని, పేర్లు రాలేదని మెప్మా సిటి మిషన్ మేనేజర్ ఆనందబాబు పేర్కొవడం విశేషం. ఆర్పీలకు ట్యాబ్‌లు వచ్చిన విషయం మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదీ కాకుండా కొంత మందికి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడంపై కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సీఎంఎం ఆనంద్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులకు సమాచారం తెలియజేయలేదన్నారు. మాకు జారీ అయిన సర్క్యులర్ ప్రకారం ఎమ్మెల్యే ద్వారా అందజేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకున్నామన్నారు. 9వ వార్డులో విషయంలో టీడీపీ వారు అభ్యంతరం చెప్పడంతో ఇవ్వలేదన్నారు.

ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం మండల ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య భజన సంఘం, శ్రీ వాసవి మహిళా మండలి వాసవి క్లబ్ కేసీజీఎఫ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. అఖిల భారత ఆర్య వైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స) వ్యవస్థాపకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్న), ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట వర ప్రసాదరావు తదితరులు రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. బోదినపల్లి శ్యాంప్రసాద్, కొమ్మూరి శారద, ఆలపాటి లక్ష్మి, కొమ్మూరి సుధారాణి, కొమ్మూరి విజయదుర్గ, వంకదారు గుప్తా తదితరులు పాల్గొన్నారు.


రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నా తదితరులు

అవనిగడ్డ: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన జయంతి కార్యక్రమంలో రోశయ్య విగ్రహానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చల్లపల్లి: స్కూటీపై వెళుతూ అదుపుతప్పి లారీని ఢీకొన్న ఘటనలో అక్క, తమ్ముడు గాయపడ్డారు. మాజేరు గ్రామానికి చెందిన జె.నాగలక్ష్మి తన తమ్ముడు నూతన్ కుమార్‌తో కలిసి శుక్రవారం జాతీయ రహదారి మీదుగా మాజేరు వెళ్లేందుకు చల్లపల్లి నుంచి పెదకళ్ళేపల్లి రోడ్డుల్లో బయలుదేరారు. జాతీయ రహదారిపై ములుపు తిరిగే ప్రయత్నంలో అదుపుతప్పి లారీని ఢీకొంది. దీంతో వారిద్దరూ గయపడ్డారు. 108 సిబ్బంది ఈఎంటి దాసి బసవరాజు, పైలెట్ రాంబాబు వారిని చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు పంపించారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

భావదేవరపల్లి(నాగాయలంక): జిల్లా సమరసత ఫౌండేషన్ అవనిగడ్డ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో ఆషాఢమాసం పురస్కరించుకుని స్థానిక గ్రామదేవత ఉర్వేళమ్మకు శుక్రవారం ఆషాఢ సారెను సమర్పించారు. సర్పంచి మండలి ఉదయ భాస్కర్, ఉమ్మడి కృష్ణాజిల్లా సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ ఆళ్ళ జయశంకర్, సంస్థ జిల్లా మహిళా కన్వీనర్ జి.నగరాజకుమారి, బందరు శాఖ కన్వీనర్ శంకర దుర్గాభవాని, అవనిగడ్డ, వినన్నపేట కన్వీనర్‌లు బోళ్ళ శ్రీరావమ్మ, జి.కనకదుర్గ, మండల కన్వీనర్ ఎం.వెంకటేశ్వరరావు,మెండు సాయిరామ్, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, ధర్మకర్తలు నిరంజనరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురంలో శ్రీబాలా త్రిపుర సుందరి సహిత శ్రీలక్ష్మీనాంచారమ్మ అమ్మవారికి భక్తులు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. కమిటీ సభ్యులు దాలిపర్తి నారాయణరావు, మోదుమూడి కుటుంబరావు, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, సుబ్బారావు పర్యవేక్షించారు.

కోడూరు: కృష్ణాతీరంలో విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణుల కుటుంబాలవారు సారెను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. చీర, గాజులు, పసుపు, కుంకుమతో పాటు వివిధ రకాల పండ్లను సారెగా సమర్పించారు. ప్రధానార్చకుడు పార్థసారధి ప్రత్యేక పూజలు చేయగా, అధికారిణి యు.జయశ్రీ పర్యవేక్షించారు.


ఉర్వేళమ్మ ఆలయంలో ఆషాఢ వేడుకలో మహిళలు


కె.కొత్తపాలెం(మోపిదేవి): కె.కొత్తపాలెంలో దుర్గా కోటేశ్వరస్వామివారి దేవస్థానంలో వారాహి గుప్త నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 9వ రోజు శుక్రవారం ఉదయం ఆలయ వ్యవస్థాపకులు రామిశెట్టి నాగరాణి, రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో పూజలు, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. అభివృద్ధి కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడిలో వేంచేసిఉన్న శ్రీ నూకాలమ్మ అమ్మవారికి మహిళా భక్తులు శుక్రవారం ఆషాఢ సారెను సమర్పించారు. నగర డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ కూడా అమ్మవారికి సారెను సమర్పించారు.

పెడన: పట్టణంలోని పలు దేవాలయాల్లో ఉన్న అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా ఆషాడం సారెను సమర్పించారు. తోటమూల మహిళా భక్తులు తోటమూల సెంటరులోని ఆంజనేయస్వామి ఆలయంలోని సీతమ్మ అమ్మవారికి, 9వ వార్డులోని సీతారాముల ఆలయంలోని సీతమ్మకు ఆషాఢ సారెను సమర్పిం చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి విభాగం ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి, సత్యభామలకు, శ్రీఆగస్తేశ్వరస్వామి శివాలయంలో పార్వతీ దేవికి, శ్యామలాంబ దేవాలయంలో అమ్మవారికి, ముత్యాలమ్మ గుడి (ఘరం గుడి)లో అమ్మవారికి, పైడమ్మ అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించారు.

మొహర్రంను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

– జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



కోనేరుసెంటర్: మొహరం దుఃఖ దినాలకు సంబంధించి జరిగే కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా జరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలోని జరీపంజ, బారాయిమామ్ పంజాలను స్వయంగా సందర్శించి, మత పెద్దలతో మాట్లాడారు. మతసామరస్యానికి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో మొహరాన్ని జరుపుకునేలా మత పెద్దలు సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట బందరు డీఎస్పీ సీహెచ్ రాజా, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పట్టణ సీఐలు అబ్దుల్ నబీ, పరమేశ్వర్, ఏసుబాబు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.